క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



గవర్ల అనకాపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మునగపాక: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అనకాపల్లి ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు ప్రేమ్‌దాస్ కోరారు. అమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం గవర్ల అనకాపల్లిలో స్వర్గీయ ఆళ్ల వరలక్ష్మి జ్ఞాపకార్థంగా గొడుగులు, మొక్కల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరలక్ష్మి జ్ఞాపకార్థంగా నాలుగేళ్ల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు దాడి వీరమహలక్ష్మినాయుడు, బొడ్డేడ చెల్లయ్యనాయుడు, చదరం భాస్కరరావు, బొడ్డేడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరాహకు వరదనీరు



జల్లూరు వద్ద వరాహ నది

కోటవురట్ల: వరాహ నదిలోకి వరదనీరు చేరుతోంది. మూడు రోజులుగా ఎగువ ప్రాంతం ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలతో నదిలో జలకళ సంతరించుకుంది. రోజు రోజుకూ నీటి ఉధృతి పెరుగుతూ వస్తోంది. చాలా కాలంగా నీరు లేక బోసిపోయిన వరాహ నది ఇప్పుడు జలకళతో కనువిందు చేస్తోంది. పాతరోడ్డు వద్ద వరాహ నదిలో సర్పానది నీరు కూడా సంగమించడంతో ఇక్కడ ఉధృతి ఎక్కువగా కనిపిస్తోంది. ఇటీవలే పందూరు వద్ద వరాహ నదిని దాటుతూ ఓ రైతు గల్లంతైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నీటి మట్టం పెరుగుతుండడంతో ఎవరూ నదిని దాటే ప్రయత్నం చేయొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

అధ్వానంగా రహదారులు



అన్నవరంలో అధ్వానంగా రోడ్డు

కోటవురట్ల: వర్షాలు దంచికొడుతున్నాయి. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. దాంతో పలు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతులు పడటంతో పాటు వర్షపు నీరు చేరడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు అంచనా తెలియక గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అన్నవరం, రాజుపేట, అణుకు వెళ్లే రహదారులు దారుణంగా ఉన్నాయి. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

నేడు ఉచిత మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

అనకాపల్లి : గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచితంగా 3,500 మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రతకథ పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక పంపిణీ చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు, ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రపతి అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాలుగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మట్టి గణపతినే పూజిద్దాం .. పర్యావరణాన్ని కాపాడుదాం... పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకుందాం.. ప్రకృతిని పచ్చగా పది తరాలకు అందిద్దాం.. అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రత్యేక అలంకరణలో వెంకన్న

కశింకోట : కశింకోటలోని వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో శనివారం స్వామిని వజ్ర కవచంతో పాటు వివిధ రకాల పూల మాలలు, తులసీ మాలలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా విష్ణు సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మునగపాక జీసీ కాలనీలో రహదారిపై నిలిచిన వర్షపునీరు



మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే దారిలో ముంపునకు గురైన వరిపొలం



రాంబిల్లిలో కురుస్తున్న వర్షం

కుండపోతగా వర్షం

- కాలనీల్లో నిలిచిన వర్షపునీరు
- ముంపునకు గురైన పొలాలు
- జనజీవనానికి అంతరాయం
- నక్కపల్లిలో 31మి.మీ, యలమంచిలిలో 88.4 మి.మీ వర్షపాతం
- అప్రమత్తమైన అధికారులు



ఎస్.రాయవరం: కొరుప్రోలులో చెరువులా మారిన రోడ్డు



ఎస్.రాయవరం: తిమ్మాపురం రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు



నక్కపల్లిలో వర్షపాతాన్ని నమోదు చేస్తున్న తహసీల్దార్

నక్కపల్లి: మండలంలో రెండో రోజు వర్షం కుండపోతగా పడింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనానికి ఇబ్బంది కలిగింది. రోడ్లపై వర్షపునీరు పారింది. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వచ్చి చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. నక్కపల్లి కాంప్లెక్స్‌లో తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాలు, ఏరియా ఆస్పత్రి ప్రాంగణాల్లో భారీగా వర్షపునీరు వచ్చి చేరింది. ఉపమాక రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, ఉపమాకలో మెయిన్‌రోడ్డుపైనా ఇదే పరిస్థితి నెలకొంది. జాతీయ రహదారి నుంచి రేబాక, ముకుందరాజుపేట, జగన్నాథపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లన్నీ వర్షపు నీటితో కనిపించాయి. రోడ్ల మీద గతుకులు ఉండటంతో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు.

నిలిచిన చేపల వేట..

రెండు రోజుల నుంచి పడుతున్న వర్షాల కారణంగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం మానేశారు. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో బడులు తెరచుకోలేదు. తీర ప్రాంత గ్రామాల్లో సిబ్బందిని అధికారులు అప్రమత్తం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం కారణంగా తుపాను ఏర్పడి బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో తీరానికి దగ్గరగా నివసించే వారు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని అధికారులు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోలు రూము ఏర్పాటు చేసి తుపాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ తెలిపారు. నక్కపల్లి మండలంలో శనివారం 31 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని తెలిపారు. వర్షాల కారణంగా ఎటువంటి పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. అయినప్పటికీ అన్ని సహాయక చర్యలకు అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. వీఆర్వోలు, కార్యదర్శులు వారి గ్రామాల్లో అందుబాటులో ఉంటూ తుఫాను ప్రభావాన్ని గమనించాలని, ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



నక్కపల్లి: రోడ్లపైకి వచ్చిన వర్షపునీరు

నిలిచిన రాకపోకలు...

యలమంచిలి రూరల్: తుపాను ప్రభావంతో యలమంచిలి పరిసరాల్లో రెండు రోజుల నుంచి కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం 3 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ 88.4 మిల్లీమీటర్ల నమోదైంది. యలమంచిలి పట్టణానికి ఆనుకున్న శేషుగెడ్డ వరద ఉధృతితో ప్రవహిస్తోంది. దాంతో వరద నీరు యలమంచిలి ప్రధాన రహదారిపై పారుతోంది. ఈ కారణంగా అర్ధగంట సేపు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షం వల్ల ప్రజల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతోంది.

లోతట్టు ప్రాంతాల్లో నీరు...

మునగపాక: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోంది. మునగపాక బీసీ కాలనీలో పలు రహదారుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో రహదారులు బురదమయంగా మారాయి. మండల సముదాయాలకు వెళ్లే దారిలో నీరు నిలిచిపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షాలకు మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇళ్లకే పరిమితమైన ప్రజలు

రాంబిల్లి (యలమంచిలి): వర్షాలకు మండలంలో లోతట్టు ప్రాంతాలంతా జలమయమయ్యాయి. నదులు, కాలువల్లోకి అధికంగా వర్షం నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాల్లో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడానికి వీలు కాక ఇళ్లలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి వచ్చింది. రాంబిల్లిలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా ఇళ్ల వద్దనే ఉండిపోయారు. తెరిపివ్వకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లలేక రాకపోకలు సాగించలేక ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో మరలా వరి పొలాల్లోకి నీరు అధికంగా చేరుతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాంబిల్లి మండలం కొత్తూరు, నారాయణపురం వద్ద శారద, మైనర్ శారద నదుల్లోకి నీటి ప్రవాహం ఎక్కువైంది. శారద పరివాహక పల్లపు ప్రాంతాలు కొంత మేర ముంపునకు గురయ్యాయి. కొన్ని చోట్ల వరి నాట్లు వేసేందుకు సిద్ధం చేసిన పొలాల్లోకి నీరు అధికంగా చేరింది. తుఫాన్ వల్ల భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు.

తెరిపివ్వని వాన

ఎస్.రాయవరం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయంగా మారాయి. లోతట్టు ప్రాంతాలు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. కొరుప్రోలు వైఎస్సార్ కాలనీకి ఆనుకున్న జంక్షన్‌లో కాలువ సక్రమంగా లేక వర్షం నీరు ఆర్అండ్‌బీ రోడ్డుపైకి ఎక్కి పారుతోంది. అడ్డురోడ్డు వాణిజ్య కేంద్రంలో రోడ్డుపై పెద్ద ఎత్తున కాలువలా నీరు పారుతోంది. సైతారుపేట, సర్వసిద్ధి, ఎస్.రాయవరం మెయిన్‌రోడ్డులపై వర్షపు నీరు పెద్ద ఎత్తున పారడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా ఆక్రమణలు చేసి కాలువలు కప్పి వేయడం వల్ల తరచూ ఈ సమస్య వస్తుందని వాహనచోదకులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

తాండవ బ్రిడ్జిపై చిల్లర దుకాణాలు

- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు



తాండవ బ్రిడ్జిపై చేపల అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం



తాండవ బ్రిడ్జిపై దుకాణాలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: తుని - పాయకరావుపేట పట్టణాలను అనుసంధానం చేసే తాండవ బ్రిడ్జిపై వ్యాపారాలు సాగించడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి ఇరువైపులా ఫుట్‌పాత్‌పై వ్యాపారులు అమ్మకాలు చేస్తుండటంతో పాదచారుల రాకపోకలకు వీలులేకుండా పోతోంది. తాండవ బ్రిడ్జిపై పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు నిత్యం బ్రిడ్జిపై తుని మార్కెట్‌కు ప్రయాణాలు సాగిస్తుంటారు. అదేవిధంగా తుని ప్రజలు పాయకరావుపేటకు వస్తుంటారు. ఇక్కడ బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై ఒక పక్కన చేపలు, ఇతర చిల్లర దుకాణాలు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటి వద్దకు కొనుగోలు చేయడం కోసం ప్రజలు గుంపులుగా ఉండడం వల్ల వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేటలో చేపల మార్కెట్, పండ్ల అమ్మకాలకు అరటికాయల మార్కెట్ స్థలం, బ్రిడ్జి దాటిన వెంటనే తునిలో చేపల మార్కెట్, పండ్ల వ్యాపారాలు ఉన్నప్పటికీ బ్రిడ్జిపైనే వ్యాపారాలు చేస్తూ ఇబ్బందికి గురిచేస్తున్నారు. సంబంధిత అధికార యంత్రాంగం దృష్టి సారించి పట్టణ ప్రజలకు బ్రిడ్జి పైన ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై సీఐ పి.అప్పలరాజును సంప్రదించగా సిబ్బంది కొరత ఉందని, వీలైనంత వరకు ట్రాఫిక్‌పై దృష్టి సారిస్తామన్నారు.

రిటైర్డ్ ఎంఈవో-2 మూర్తి సేవలు ప్రశంసనీయం



మూర్తిని సత్కరిస్తున్న డీఈవో తదితరులు

ఎస్.రాయవరం: విద్యా శాఖలో ఎంఈవో- 2 ఏఎస్ఏఎస్ఏఎస్ మూర్తి అందించిన సేవలు ప్రశంసనీయమని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎంఈవో- 2 ఏఎస్ఏఎస్ఏఎస్ మూర్తి పదవీ విరమణ చేయడంతో శనివారం పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఆయన్ను ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ ధర్మారావు, తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరై డీఈవో మాట్లాడుతూ మూర్తి శేష జీవితం సుఖమయం కావాలని ఆకాంక్షించారు. విజయనగరం డీఈవో ప్రేమ్‌కుమార్, యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, శ్రీఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ సీతారామరాజు, మండల నాయకులు అబద్దం, నల్లపరాజు వెంకటరాజు, షడ్రక్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి



రిటైర్డ్ వీఆర్వో దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: పదవీ విరమణ పొందిన ఉద్యోగులు శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఉప్పరాపల్లి, వెంకటాపురం సర్పంచ్‌లు శానాపతి శ్రీరాములు, సత్యం తెలిపారు. ఉప్పరాపల్లి రెవెన్యూ వీఆర్వో కీర్తి వెంకటేశ్వరరావు పదవీ విరమణ పొందారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయనకు రెండు గ్రామాల పెద్దలు ఘనంగా సత్కరించారు. వీఆర్వో దంపతులను సత్కరించి రైతులకు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మపాల నాగేశ్వరరావు, నాయకులు ముప్పిన శ్రీను, వీఆర్వోలు పాల్గొన్నారు.

దళితుల పింఛన్లు తొలగింపు అన్యాయం

కౌన్సిల్‌లో గళమెత్తిన మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి

నర్సీపట్నం: తన వార్డులో పింఛన్ల తొలగింపుపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి కౌన్సిల్‌లో అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎజెండా చదివిన అనంతరం మాజీ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి దళితుల పింఛన్లు ఎవరు తొలగించారో సమాధానం చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్షతో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 17వ వార్డుకు చెందిన దళితులైన 10 మంది పింఛన్లు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వారిలో చెప్పులు కుట్టుకునే వారు, రిక్షా కార్మికులు ఉన్నారన్నారు. పేదల పింఛన్లు తొలగించి పొట్టకొట్టడం సరికాదని, ఏకారణంతో తొలగించారో అధికారులు సమాధానం చెప్పాలన్నారు. టీడీపీకి చెందిన 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి జోక్యం చేసుకొని కేవలం ఎస్సీల పింఛన్లు తొలగించారని మాట్లాడడం సరికాదన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. విషయాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లి తొలగించిన పది మందికి అర్హత ఉంటే పింఛన్లు పునరుద్ధరించి న్యాయం చేస్తామని పద్మావతి పేర్కొన్నారు. పింఛన్లు ఎవరి ప్రోద్బలంతో తొలగించారో కౌన్సిల్ ముందు పెట్టాలని మాజీ చైర్‌పర్సన్ డిమాండ్ చేశారు. వాహనాలకు వినియోగించే డీజిల్ బిల్లుల్లో అధికారులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య ఆరోపించారు. ఈ విషయంపై కమిషనర్ సురేంద్ర స్పందిస్తూ పూర్తిస్థాయిలో ఆడిట్ చేయించి, రుజువైతే సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. స్పీకర్ మున్సిపాలిటీకి రూ.4.11 కోట్లు మంజూరు చేయించారని, ఈ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని, కాలువల్లో పూడిక తీయడానికి మరో రూ.45 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులు

గొలుగొండ: మండలంలో చీడిగుమ్మల గ్రామంలో శనివారం స్పీకర్ అయ్యన్న పర్యటనలో మండల, పంచాయతీ స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని జడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సర్పంచ్ కాపారపు చినబ్బాయి, ఎంపీటీసీ లెక్కల అప్పలనాయుడు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ చీడిగుమ్మలలో స్పీకర్ అయ్యన్న పర్యటన దృష్ట్యా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీకి కనీసం సమాచారం అందించకపోవడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

కేసుల రాజీకి లోక్ అదాలత్ చక్కని వేదిక

నర్సీపట్నం: కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక అని సీనియర్ సివిల్ జడ్జి పి.షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ నెల 14 న జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతుల సమ్మతం లేకుంటే స్మార్ట్ మీటర్ల నిలుపుదల

మునగపాక: రైతుల నుంచి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పట్ల వ్యతిరేకత వస్తే బిగింపు నిలుపుదల చేస్తున్నామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. సాక్షి దినపత్రికలో శనివారం వచ్చిన రైతులపై స్మార్ట్‌మీటర్ల పిడుగు వార్తకు ఆయన స్పందించారు. మునగపాక సెక్షన్‌కు సంబంధించి 3,012 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. వాటిలో 1,213 కనెక్షన్లకు డీపీటీ పథకం ద్వారా గతంలోనే స్మార్ట్ మీటర్లు అమర్చామన్నారు. మీటర్ల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, అభ్యంతరాలు తలెత్తిన చోట బిగింపు ప్రక్రియ ఆపివేస్తున్నామన్నారు. మండలంలో డీబీటీ పథకంలో 1,799 స్మార్ట్‌మీటర్లు అందించాల్సి ఉందన్నారు. కశింకోట డివిజన్ పరిధిలో 12,975 కనెక్షన్లు ఉండగా, 9,662 కనెక్షన్లకు రైతుల అనుమతితో స్మార్ట్‌మీటర్లు బిగించామన్నారు. 3,313 కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు అమర్చాల్సి ఉందన్నారు. మునగపాక మండలంలో రెండు నెలల క్రితమే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారన్నారు. విద్యుత్తు సంబంధిత సమస్యల పరిష్కారానికి 1912 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ పింఛన్ల మంజూరు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందుతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తెలిపారు. శనివారం ఆయన మునగపాకలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి నెలా రూ.4 వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. పార్టీ నేతలు పెంటకోట విజయ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీరామమూర్తి, కేపీ రావు, బీలా లక్ష్మణరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

నక్కపల్లి: మండలంలో సామాజిక భద్రతా పథకం కింద మంజూరు చేసిన పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే వీటిని పంపిణీ చేపట్టారు. అన్ని గ్రామాల్లోను సచివాలయ సిబ్బంది, కార్యదర్శుల ద్వారా పింఛన్ల బట్వాడా చేశామని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. 92 శాతం మందికి పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా మిగిలిపోతే రెండో తేదీన పంపిణీ చేయాలని ఆదేశించామన్నారు.